విజయవాడ నిరవధిక దీక్షలో వాణిశ్రీ

అంధ'కారం'లో జూనియర్ లైన్‌మెన్లు

ఐదేళ్లుగా ప్రొబేషన్ డిక్లరేషన్‌కు నిరీక్షణ
ప్రమోషన్లు, మెడికల్ లీవ్‌లు నిల్
నేడు డిస్కం ఎదుట మహా ధర్నా

విద్యుత్ సంస్థల్లో పని చేసే గ్రేడ్ 2 జూనియర్ లైన్‌మెన్లు ఐదేళ్లుగా ప్రొబేషన్ డిక్లరేషన్‌కు నోచుకోలేదు. దీని వల్ల ప్రమోషన్లు, మెడికల్ లీవులు కరువయ్యాయి. ఎర్న్ లీవులు వర్తింప చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితిల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 19న శుక్రవారం మహాధర్నాకు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అందరికి వెలుగు ఇచ్చే విద్యుత్ సంస్థల్లో కీలకంగా వ్యవహరించే జూనియర్ లైన్‌మెన్ల జీవితాలు చీకటిమయంగా ఉంటున్నాయి. 2019, అక్టోబరు 2న రాష్ట్రంలోని మూడు డిస్కంల పరిధిలో 7,329 మంది గ్రేడ్ 2 జూనియర్ లైన్‌మెన్లను (జెఎల్‌ఎంలను) నోటిఫికెషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భర్తీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వీరిని ఎనర్జీ అసిస్టెంట్లుగా వ్యవహరిస్తూ సచివాలయం పరిధిలో విధులు నిర్వహింపజేస్తున్నారు. కానీ వీరిలో ఇప్పటికీ అనేక సందేహాలు ఉన్నాయి. వీరు సచివాలయం ఉద్యోగులా, విద్యుత్ సంస్థకు చెందిన ఉద్యోగులా అనే సందేహం అందరిలో ఉంది. విధిల్లోకి తీసుకున్న వీరికి రెండేళ్లు పూర్తికాగానే ప్రొబేషన్ డిక్లేర్ చేయాల్సి ఉండుగా ఐదేళ్లు అవుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్ సంస్థలోని సెక్షన్ ఆఫీసర్ ఎఈ కంట్రోల్‌లోనే పని చేస్తున్నారు. అయితే సచివాలయం వారికిస్తున్న బేసిక్‌తో హెచ్‌ఆర్‌ఎ, డిఎ కలిపి వారి జీతాలను విద్యుత్ సంస్థ చెల్లిస్తోంది. ప్రొబేషన్ డిక్లేర్ చెయగానే ప్రమోషన్లు ఇవ్వాలి, ఎర్న్ లీవులు, మెడికల్ లీవులు జూనియర్ లైన్‌మెన్లుకు అమలు చేయాల్సి ఉంది. కానీ ఐదేళుగా ఇవి అమలు కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 212 మంది మరణించారు. వందలాది మంది అంగవైకల్యం పొందారు. వారికి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి నష్టపరిహారం కూడా అందలేదు. 5 సంవత్సరాలుగా వారు ఇబ్బందులు పడుతూనే ఈరోజో రేపో మంచి జరుగుతుందనే ఆశగా జీవిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న శుక్రవారం ఎపిఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఇప్పటికైన అధికారులు, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు.

సమానపనికి సమానవేతనం చెల్లించాలి : శేఖర్, డిస్కం అధ్యక్షులు, యుఇఇయు

కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ట్రాన్స్కో, జెన్కోలో లాగా డిస్ట్రిబ్యూషన్ కంపెనీలలోనూ కాంట్రాక్ట్ కార్మికులకు ఒకే పద్ధతిలో వేతనాలు చెల్లించాలి. ఐటిఐ అర్హత కలిగి కాంట్రాక్ట్ వాచ్మెన్ గా పనిచేస్తున్న వారికి షిఫ్ట్ ఆపరేటర్‌గా ప్రమోషన్ అవకాశం కల్పించాలి.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి : కుమార్, జిల్లా కార్యదర్శి, యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చినటువంటి వాగ్దానాలను అమలు చేయాలి. తెలంగాణ తరహాలో 43,700 జీతాన్ని ఆంధ్రప్రదేశ్లోనూ అమలు చేయాలి. పది సంవత్సరాలుగా పనిచేస్తూ వాచ్ అండ్ వార్డ్ టు షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమితులైన వారందరికీ పాత జీతం విధానాన్ని అమలు చేయాలి.

అరియర్స్ బకాయిలు చెల్లించాలి: సోమసుందరం, వర్కింగ్ ప్రెసిడెంట్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ సమాన పనికి సమానం ఇవ్వాలి. 2022 పిఆర్సి ప్రకారం జీతాలను చెల్లించాలి. 2022, ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు రావలసినటువంటి అరియర్స్ బకాయిలను ఇప్పించాలి.

కొత్త జీవోలను రద్దు చేయాలి : -పి.శివప్రసాద్‌రెడ్డి, రీజనల్ సెక్రటరీ

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల కడుపు కొడుతున్నటువంటి కొత్త జీవోలను రద్దు చేయాలి. పీస్ రేట్ విధానాన్ని రద్దుచేసి కార్మికులకు జీతభత్యాన్ని అమలు చేయాలి. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థ నుంచి నేరుగా జీతాలు ఇప్పించి కాంట్రాక్టర్‌ను రద్దు చేయాలి. ఇలా ఇవ్వడం వల్ల దాదాపుగా 150 కోట్లు విద్యుత్ సంస్థకు మిగులుందనే విషయాన్ని అధికారులు ఆలోచించాలి.

మహాధర్నాను జయప్రదం చేయండి : సూరిబాబు, రాష్ట్ర అధ్యక్షులు



విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న శుక్రవారం ఉదయం తిరుపతిలోని ఏపిఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యలయం వద్ద జరిగే మహాధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలి. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగడుతూ, అధికారుల తీరుపై నిలదీస్తూ చేపట్టే ఆందోళనకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులు తరలివచ్చి, జయప్రదం చేయాలి.

నేడు విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ల ధర్నా

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

జూనియర్ లైన్ మెన్ గ్రేడ్2 వారి సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది వేల మందికి పైగా ఉన్న జూనియర్ లైన్ మెన్ గ్రేడ్ 2 ఉద్యోగులు డిస్కాంల ద్వారా సచివాలయాల ఉద్యోగులుగా ఎంపికయ్యారని... వారికి డిస్కాం నిబంధనలకు అనుగుణంగా ప్రొబెషన్ డిక్లేర్ చేయడం గాని, ఏఎల్‌ఎం లుగా ప్రమోషన్లు ఇవ్వడం కానీ చేయకుండా అధికారులు బంతాట ఆడుకుంటున్నారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాణత్యాగానికైనా సిద్ధం

విజయవాడ నిరవధిక దీక్షలో వాణిశ్రీ
తిరుపతిలో 'మౌనదీక్ష'.. సంతకాల సేకరణ
సమ్మె కొనసాగింపే మా 'సమాధానం'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, యంత్రాంగం

'సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్లతో అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన సమ్మె 38వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడం తప్ప, ప్రధాన డిమాండ్లను పరిష్కరించిన పాపాన పోలేదు. ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ సేవలు అత్యవసరం అంటూ ఎస్మా ప్రయోగించింది. ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు వివరణలు ఇచ్చాం. అయినా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది.. అందుకే నిరవధిక దీక్షకు పూనుకున్నాం. విజయవాడ కేంద్రంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర కోశాధికారి బాధ్యతల్లో ఉన్న నేను ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నాను. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ ఎటువంటి పరిస్థితుల్లోనూ సమ్మె విరమించేది లేదు' అని విజయవాడలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక దీక్షలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ 'ప్రజాశక్తి'కి తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొండితనం వీడి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరుసార్లు చర్చల పేరిట పిలిచి పరిష్కరించకుండా మహిళల పోరాటాన్ని అపహాస్యం చేశారు. నోటీసులు, ఎస్మా పేరుతో అంగన్‌వాడీలను తొలగించడానికి, ఉద్యమాన్ని అణచివేయడానికి అన్ని రకాల నిరంకుశత్వాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రయోగిస్తున్నారు. అందుకే అంగన్‌వాడీలు చావోరేవో తేల్చుకునేందుకు 17వ తేదీ నుంచి నిరవధిక దీక్ష నిర్వహిస్తున్నాం. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ నేతృత్వంలో రాష్ట్ర నాయకులు అందరూ ఈ దీక్షలో కూర్చున్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ ఈ ఉద్యమం ఆగదు అని చెప్పారు. మహిళల పోరాటాన్ని తక్కువ అంచనా వేస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేలా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం.

రేణిగుంటలో...

- గూడూరు టౌన్‌లో ఎ.ఇంద్రావతి, బిఎస్ ప్రభావతి, పెంచలమ్మ, లక్ష్మీ, మునికుమారి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ మాట్లాడుతూ తమ కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమై నిరవధిక దీక్షలు చేస్తున్న రాష్ట్ర నాయకత్వానికి సంఘీభావంగా సమ్మెను మరింత పట్టుదలతో కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
- పుత్తూరు టౌన్‌లో తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా ఐసిడిఎస్ కార్యాలయం వరకూ వెళ్లి సిడిపిఒ పద్మజకు వినతిపత్రం ఇచ్చారు. విధుల్లో చేరాలని సిడిపిఒ నోటీసు ఇచ్చినందుకు బదులుగా సమస్యలను పరిష్కరించేంత వరకూ పోరాటాల్లో ఉంటామనిసిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, అంగన్‌వాడి నాయకురాలు మునికుమారి స్పష్టం చేశారు.
- సిఎం వైఖరిని నిరసిస్తూ అంగన్‌వాడీల కోటి సంతకాలలో భాగంగా లబ్దిదారులు, ఇతరులతో సంతకాల సేకరణ చేస్తూ మౌనదీక్ష చేపట్టారు. యూనియన్ నాయకులు నాగరాజమ్మ, జైప్రభ, గంగాదేవి మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు ఏ విధంగా పోరాడారో, అదే స్ఫూర్తితో సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. సిఎం జగన్ మనస్సు మార్చాలని గంగమ్మకు మొక్కామని, పండుగలు సైతం జరుపుకోకుండా శిబిరాల్లోనే జరుపుకున్నామన్నారు. ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి అంగన్‌వాడీందరూ సంసిద్ధంగా ఉన్నారన్నారు. జీతాలు పెంచకుండా మొండిగా ఉంటే ప్రభుత్వం అంగన్‌వాడీల ఆగ్రహజ్వాలకు గురికాక తప్పదన్నారు.కార్యక్రమంలో గీత, కల్పన, గోమతి, ఎల్లమ్మ, వరలక్ష్మి, సుజిత, సుజాత, రోజా, యువరాణి తదితరులు పాల్గొన్నారు.
- రేణిగుంట ఐసిడిఎస్ అధికారి కృష్ణమంజరికి 'షోకాజ్ నోటీసులకు సామూహిక వినతి'ని అందించారు. 26వ రోజు రిలే దీక్షల్లో 10 మంది పూలమాలలు వేసుకుని ఉపవాస దీక్షను కొనసాగించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పంపిన నోటీసులకు వివరణ ఇస్తూ 200 మంది లెటర్లు పట్టుకుని సామూహిక వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ధనమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.
- సత్యవేడులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మికి లిఖితపూర్వక సమాధానాన్ని అంగన్‌వాడీలు సిఐటియు సత్యవేడు డివిజన్ సెక్రటరీ ఎం.రమేష్ ఆధ్వర్యంలో అందించారు. నిర్మల, శాంతి, భారతి, ఝాన్సీ, మంజుల, భువన, కాంతమ్మ, అనురాధ, చందామరి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.
- సూళ్లూరుపేటలో సిఐటియు మండల అధ్యక్షులు రమణయ్య, కార్యదర్శి కె.లక్ష్మయ్య ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది.
- శ్రీకాళహస్తిలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సంఘీభావం ప్రకటించారు.
- నాయుడుపేటలో శిబిరం వద్ద కబడ్డీ పోటీలను నిర్వహించి నిరసన కొనసాగించారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచులు 'కీ'లకం

ప్రజాశక్తి - క్యాంపస్

గ్రామాభివృద్ధిలో సర్పంచులు కీలకమని, రాబోవు రోజుల్లో సర్పంచులు సలహాలు ఇచ్చేలా ఉండాలని కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ అన్నారు. గురువారం ఉదయం పద్మావతి మహిళా విశ్వ విద్యాలయ ఆడిటోరియంలో ఆరోగ్యకర భవిష్యత్ దిశగా ఆరోగ్యకర గ్రామం అనే అంశంపై మూడు రోజుల జాతీయ వర్కుషాపును మంత్రి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచుల్లో ఆత్మవిశ్వాసం నిండుగా ఉండాలని, అభివృద్ధి అనే భవంతిలో 'కీ'లాంటివాడని అన్నారు. రానున్న 2047 నాటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతదేశం వికసిత్ భారత్ లక్ష్యంతో, భారత ప్రధాని సంకల్పంతో అభివృద్ధి పథంలో నిలవనున్నదని అన్నారు. గ్రామాల్లో సర్పంచులు, స్వయం సహాయక మహిళా సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అయినా ఇంకా ఎన్నో గ్రామాలు అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. ఆత్మ విశ్వాసంతో సర్పంచులు అభివృద్ధికి నాంది పలకాలన్నారు. దాహం వేసినపుడు నీళ్లకోసం ఆలోచించడం సరికాదని, తాతలు నదులు, నీటి కాల్వలు చూస్తే, మన తండ్రులు బావులు, మనం బోర్లలో నీటిని చూస్తున్నామని, మన పిల్లలు బాటిల్స్ చూస్తున్నారని, ఆ తరువాత కన్నీళ్లు చూడాల్సి ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2వేల కోట్లతో జలజీవన్ మిషన్ ఏర్పాటుతో గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నారని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి బి. ముత్యాలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధపెట్టారన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారి, ఉమ్మడి జిల్లా జడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, సిఇఒ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి పానల్ డిస్కషన్లు నడిచాయి. జాతీయ అవార్డులు పొందిన గ్రామ పంచాయతీల నుంచి మాజీ సెక్రటరీ విజయనంద్, అవార్డులు అందుకున్న సర్పంచులు తమ ప్రతిభను సభా వేదికగా వివరించారు.

వర్కుషాపులో మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్

ఆకట్టుకున్న స్టాల్స్

ఆప్కో వారి చేనేతలు ,చీరలు, టీటీడీ పంచగవ్యాలు, ఐసిడిఎస్ పోషకాహారాలు, డిఆర్డిఏ శ్రీకాళహస్తి కలంకారి, మాధవ మాల కోయ బొమ్మలు, మహిళ రైతుల ఉత్పత్తులు, ఎర్రమరెడ్డి పాలెం రాగి పాత్రలు, విజయనగరం వారి మిల్లెట్స్ ప్రదర్శన, నెల్లూరుజిల్లా ఉదయగిరి వారి చెక్కతో తయారుచేసిన వంట సామాగ్రి (కట్లరీ), ఆయుష్మాన్ భారత్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రదర్శనలు వంటివి సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి పాల్గొన్నారు.

'పేదలందరికీ ఇళ్లు' లబ్దిదారులకు వడ్డీ జమ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' లబ్ధిదారులు వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి పేద అక్కాచెల్లెళ్లకు అండగా నిలుస్తూ వారి సొంత ఇంటికలను నిజం చేస్తూ నవరత్నాలు - పేదలందరికీ మొదటి దఫా అర్హులైన 4,07,323 మంది లబ్ధిదారులకు వడ్డీ రియింబర్స్మెంట్ కింద రూ. 46.90 కోట్లను కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జమ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, జిల్లా హౌసింగ్ అధికారి వెంకటేశ్వర్లు, డి ఈ శ్రీనివాసరావు, మెప్మా పిడి రాధమ్మ, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులు వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలో 72,437 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 20,824 ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ళు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 20301 మంది ఇళ్ల లబ్ధిదారులకు పావలా వడ్డీకి రూ.35 వేల చొప్పున బ్యాంకు నుండి రుణం తీసుకున్న వారికి వడ్డీ రియింబర్స్మెంట్ కింద రూ. 2,57,30,508 కోట్లు లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి లబ్ధిదారులకు వడ్డీ రియింబర్స్మెంట్ రూ . 2,57,30,508 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

కులగణన పక్కాగా చేపట్టండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి కులగణన పక్కాగా చేపట్టాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. కులగణనపై నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శుక్రవారం నుండి పది రోజుల పాటు ఇంటింటికి వెళ్ళి సచివాలయ సిబ్బందిచే కుల గణన సర్వే చేయించాలని అన్నారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. కులాల వారి జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోగతి నమోదు చేయాలని అన్నారు. ఈ కులగణన ద్వారా అత్యంత ఉపయోగకరమైన పథకాలు రూపకల్పన చేయడానికి, అర్హులైన వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడానికి, పథకాలు సక్రమంగా అమలు పరచి తద్వారా సామాజిక న్యాయాన్ని పెంపొందించి, సమ సమాజాన్ని స్థాపించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కుల గణన జరుగు రూట్ మ్యాప్, రోజువారీ సందర్శన షెడ్యూల్ సిద్ధం చేశామని అన్నారు. వీటిని వార్డు సచివాలయము నందలి నోటిసు బోర్డు నందు ప్రదర్శించడం జరిగిందని అన్నారు. వసతి గహములు , వద్ధాశ్రమము మొదలైనవి గణన చేయునపుడు ప్రత్యేక శ్రద్ధ వహించి డూప్లికేట్ జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. కుల గణన నిర్వహించు తేదిల్లో జనవరి 19 నుంచి 28 వరకు క్షేత్ర సిబ్బందికి అన్ని విధాలా సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌలేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఎం.ఈ. వెంకట్రామి రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు కే.ఎల్.వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డి.సి.పి శ్రీనివాసులు రెడ్డి, ఏసిపి బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సెర్ప్ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-నారాయణవనం

వైఎస్ఆర్ సెర్ప్ ఉద్యోగులు నారాయణవనం మండలం వెలుగు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఎం మమత మాట్లాడుతూ సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి, క్యాడర్ స్కేల్ ఫిక్స్ చేస్తూ పంచాయతీరాజ్ ఇచ్చిన ఆదేశాల సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్నటువంటి ఇపిఎఫ్ సీలింగ్ విధానం తీసివేసి మూలవేతనంపై వందశాతం ఇపిఎఫ్ అమలు చేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తూ పేస్కేల్ వర్తింపజేయాలన్నారు. రూలాఫ్ రిజర్వేషన్ వర్తింపజేస్తూ ఉద్యోగులందరికీ ప్రమోషన్ ఇవ్వాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో సిసిలు నాగేంద్రరావు, మురళి, సురేష్ పాల్గొన్నారు.

ఖాళీ టిన్‌ల విక్రయానికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌ల అమ్మకానికి రేటు కాంట్రాక్టు కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన వారు డిసెంబరు - 2024 వరకు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్‌లు సేకరించవచ్చు. తిరుపతి హరేకృష్ణ రోడ్డులో గల మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు జనవరి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయవలెను. ఇతర వివరాలకు మార్కెటింగ్ (వేలం) కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో సంప్రదించగలరు.

ఎల్‌బి ప్రభాకర్‌నాయుడు మృతికి నివాళి

ప్రజాశక్తి - పాకాల

తుడా మాజీ ఛైర్మన్, టిడిపి మండల అధ్యక్షులు ఎల్‌బి ప్రభాకర్‌నాయుడు మృతికి చంద్రగిరి ఎంఎల్‌ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబం, టిడిపి నియోజకవర్గ అభ్యర్థి పులివర్తినాని కుటుంబం నివాళి అర్పించారు. ఎల్‌బి ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. పాకాల పట్టణం కమతంపల్లెకు చెందిన ఆయన యువకునిగా ఉన్నప్పటి నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి, కొడుకు వినీల్‌తో కలిసి పార్థివదేహానికి నివాళి అర్పించారు.

నివాళి అర్పిస్తున్న పులివర్తి కుటుంబం

నేడు వెంకటగిరికి నారా చంద్రబాబు

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరిలో శుక్రవారం 'తెలుగుదేశం పిలుస్తోంది రా... కదిలిరా..' సభ జరగనుంది. ఈ సభకు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు రానుండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదో విడత నేతల నేస్తం సభ నిర్వహించిన ప్రదేశంలోనే లక్ష మందితో సభ ఏర్పాట్లకు సిద్ధం చేస్తున్నారు. హెలికాప్టర్‌లో విశ్వదయ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో దిగి, అక్కడనుంచి రోడ్డు మార్గాన రాణిపేట అడ్డరోడ్డు మీదుగా ఐబిటి ఎదురుగా ఉన్న ప్రైవేట్ స్థలంలో సభ ఏర్పాట్లను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. దాదాపు లక్ష మందికి భోజన, మంచినీటి ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. టికెట్ ఆశిస్తున్న నాయకులు కురుగొండ్ల రామకృష్ణ, బులిగిలి మస్తానీయాదవ్ పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు సైతం ఫ్లెక్సీల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల లోపు ఈ సభ పూర్తి కానుంది.

స్విమ్స్‌లో అవయవ మార్పిడి శస్త్రచికిత్స సక్సెస్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్‌లో ఏకకాలంలో గుండె, లివర్, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం సామనత్తంకు చెందిన గొల్లపల్లి హేమకుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ కావడంతో అతని తల్లిదండ్రులు మానవతాదృక్పథంగా హేమకుమార్ లివర్, కిడ్నీ, గుండెను దానం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో హేమకుమార్ గుండెను శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి, కిడ్నీ నెల్లూరు అపోలో ఆసుపత్రికి, తరలించారు. మరో కిడ్నీ, లివర్‌ను స్విమ్స్‌లోనే ఓ రోగికి విజయవంతంగా అమర్చారు. ఈ సందర్భంగా టిటిడి జేఈవో సదాభార్గవి గురువారం విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ, లివర్ మార్పిడిని విజయవంతంగా నిర్వహించిన స్విమ్స్ వైద్యులను అబినందించారు. కోటి రూపాయలు విలువ చేసే అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ, టిటిడి ప్రాణదానం కింద ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్రెయిన్‌డెడ్ గురైన హేమకుమార్ కిడ్నీల్లో ఒకదాన్ని పూతలపట్టు మండలానికి చెందిన 51 సంవత్సరాల మహిళకు, రెండో కిడ్నీని నెల్లూరు 37 సంవత్సరాల వ్యక్తికి, గుండెను 53 సంవ్సరాల వయసుగల మహిళకు అమర్చామని తెలిపారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో పరోక్షంగా, ప్రత్యక్షంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టరు ఆర్ వి .కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్స్‌ను అబివృద్ధి చేయాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి సూచన మేరకు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలతో స్విమ్స్ స్థాయిని పెంచుతున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇలాంటి శస్త్రచికిత్సలు దేశంలో ఎక్కడ జరగలేదని తొలిసారిగా స్విమ్స్‌లోనే ఆవిష్కృతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టరు రామ్, డాక్టరు అనిల్‌కుమార్, డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి, డాక్టరు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 20వ తేదీ నుండి 28వ తేదీ వరకు తిరుపతి నగర పరిధిలోని వినాయక నగర్ క్వార్టర్స్ సమీప మైదానంలో భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో 16వ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శనలో టీటీడీ ప్రచురణలు, భవన్ ప్రచురణలు, అరబిందో సొసైటీ, సైన్స్ యూనివర్సిటీ, విజయవాడ ప్రింటర్స్, మలయాళ మనోరమ ఇలా 70 పటనోపయోగ్య స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీయూ మాజీ విసి, భారతీయ విద్యా భవన్ తిరుపతి కేంద్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పి.మురళి పాల్గొంటారన్నారు. దశాబ్దాలుగా పుస్తక ప్రేమికులకు, విద్యార్థులకు సాహిత్యం, సామాజిక శాస్త్రాలు, విద్య, విజ్ఞానం, పోటీ పరీక్షలు ఇలా చక్కటి అంశాలతో కూడిన పుస్తకాలను అందుబాటు ధరలకే విక్రయిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పుస్తక ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పుస్తక ప్రదర్శనకు సంబంధించి పోస్టర్లను ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దక్షిణా మూర్తి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మృతి వనాన్ని ప్రారంభించే అర్హత సిఎంకు లేదు: చిట్టిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దళితుల అభివృద్ధికి వినియోగించే సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అంబేద్కర్ స్మృతి వనాన్ని ప్రారంభించే అర్హతలేదని కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి గౌడపేరు చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు పూర్తి విరుద్ధంగా కార్యకలాపాలు చేసిన జగన్ నేడు అంబేద్కర్ స్మృతి వనాన్ని ఎలా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో దళితుల ఓట్ల కోసం వారిని అంబేద్కర్ పేరు చెప్పి మరోసారి దగా చేయడానికి సీఎం సిద్ధమయ్యారన్నారు.

స్థానికులనే అభ్యర్థులుగా ప్రకటించాలి

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థి ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సత్యవేడు నియోజక వర్గానికి అభ్యర్థులను ప్రకటించేటప్పుడు రాజకీయ పార్టీలు స్థానికులనే అభ్యర్థులుగా ప్రకటించాలని సత్యవేడు నియోజకవర్గ యువజన విద్యార్థి ఐక్యవేదిక నాయకులు భూమా గణేష్ విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి ఎప్పుడు స్థానికేతరులకు టికెట్లు కేటాయించడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే అవకాశం, ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం వంటి పరిస్థితి ఉందన్నారు. అందుచేత స్థానికులనే అభ్యర్థులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాలేని పక్షంలో ఓటమి చవి చూపిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునివేలు, మహేష్, సూర్య పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు

బహుమతులు ప్రదానం చేస్తున్న ధనపాల్

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: మానసికోల్లాసానికి క్రీడలు అవసరమని తెలుగు యువత రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ డీజీ ధనపాల్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని చర్చి కాంపౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరిగింది. విజేతలకు ధనపాల్ బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం

ప్రజాశక్తి-బాలాయపల్లి: సంక్రాంతి సంబరాలు వైభవంగా ముగిశాయి. మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు గురువారం గౌరవ దేనికి ప్రత్యేక పూజలు చేశారు. గొబ్బెమ్మ, ఆటపాటలతో అలరించి, అనంతరం ఊరేగింపు నిర్వహించి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-ఓజిలి: ఉజ్వల దీపం కనెక్షన్లను కేంద్ర సమాచార సహాయ మంత్రి దేవ్ సింగ్ చౌహాన్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.దయాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు ఆరుమూళ్ళ వరప్రసాద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎంపీడీవో రజినీకాంత్ , సర్పంచ్ గోపాలయ్య అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రితో కలిసి గురువారం ఓజిలి మండలంలోని తిరుములపూడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ పరిపాలనలో భారతదేశం సుభిక్షంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదప్రజల సంక్షేమం కోసం 18 రకాల సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలకు జీవన సరళిక తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రముని, తహశీల్దార్ శివరామ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త ఎన్‌టీఆర్

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): రాష్ట్రంలో అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమ పథకాలకు ఆద్యుడిగా ఎన్‌టీఆర్ నిలిచారని టీడీపీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యంనాయుడు అన్నారు. గురువారం చంద్రగిరిలో ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌస్ బాషా, రమేష్ రెడ్డి, ధనంజయ రెడ్డి, వినోద్ రెడ్డి, సునీల్, లలిత, నాగరాజనాయుడు, సునీల్‌నాయుడు, హరి, తులశీశ్వరరెడ్డి, కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నారావారిపల్లెలో...

నారావారిపల్లిలో ఐటీడీపీ మండల అధ్యక్షులు రాకేష్‌చౌదరి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.సర్పంచ్ లక్ష్మి, లతీష్ చౌదరి, జ్యోతి, రానేమ్మా, హేమాద్రినాయుడు, దేవిలాల్ ఉన్నారు.

రామచంద్రాపురంలో...

మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జనార్దన్‌చౌదరి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, గిరిధర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ఢిల్లీనాథ్ రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోనీ టీడీపీ కార్యాలయం సమీపంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, నాయకులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అన్నదాన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, చెంచురామయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, రహీమ్, శ్రావణి, నరసింహులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): మంగళం రవాణా శాఖ కూడలిలో ఎన్‌టీఆర్ 28వ వర్ధంతిని స్థానిక టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, సురేష్, గోవిందరాజులు, భాస్కర్ రెడ్డి, పాలచంద్ర, గోపీనాథ్, మహేశ్వరి, భాస్కర్ రెడ్డి, చెన్నరాయప్ప, అల్లాభాష, అజీజ్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని మోదుగులపాలెం గ్రామంలో ఎన్‌టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు నాగరాజు నాయుడు, రవి నాయుడు, మురగయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం: మండలంలోని పాలమంగళం గ్రామంలో ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోదండపాణి, మునిబాబు, శేఖర్, పట్టాభిరెడ్డి, రఘురామయ్య, శంకరయ్య, భైరవయ్య, రవి, గోపాల చారి పాల్గొన్నారు.

ఓజిలి: ఎన్‌టీఆర్ వర్ధింది సందర్భంగా గురువారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు కంకణాల రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్ నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, వరప్రసాద్ నాయుడు, వెంకటసుబ్బయ్య, సరోజనమ్మ, ఖలీల్, సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: నందమూరి తారక రామారావు వర్ధంతిని టిడిపి మండల కన్వీనర్ బెల్లంకొండ మురళి ఆధ్వర్యంలో చిన్నగొట్టిగల్లులో ఘణంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మోహన రెడ్డి, రమణా రెడ్డి, చంద్రశేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్ర పటానికి మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కన్నయ్య నాయుడు, మనోహర్ నాయుడు, సుధాకర్ నాయుడు, వీర రాఘవులు, రాజ్యలక్ష్మి, శశి, వెంకట చలం పాల్గొన్నారు.

పిచ్చాటూరు: ఎన్‌టీఆర్ 28 వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని కారూరు గ్రామంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు మాధవనాయుడు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు డి.ఇళంగోవ రెడ్డి, రవీందర్‌నాయుడు, కొళ్ళాపురి రెడ్డి, కె.మణి, సెల్వకుమార్, పెరుమాల్, అశోక్, చెంగల్రాయులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి వేడుకలను రాష్ట్రకాపు నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ అదృష్టం ఎన్టీఆర్ అని, అయన పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, మహిళలకు ఆస్థి హక్కును ప్రవేశపెట్టిన మహనీయుడని, మహిళల కోసం మహిళా విశ్వవిద్యాలయాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు డా.పి.ఎస్.కరుణానిధి, తమ్మిశెట్టి మురళి, వాసుదేవ్, రామారావు తదితరులు పాల్గొన్నారు. **టీడీపీ ఆధ్వర్యంలో...** ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా టౌన్‌క్లబ్ వద్ద టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నర్సింగ్ యాదవ్ ఎన్టీ రామారావు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణారెడ్డి, ఆర్‌సీ మునికృష్ణ, పూక విజయ్‌కుమార్, దంపురి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, బ్యాంక్ శాంతమ్మ, చిన్నబాబు, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక కార్వేటినగరం రోడ్డులో ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ చేతులు మీదుగా టీడీపీ జెండా ఆవిష్కరించారు. చిత్తూరు పార్లమెంటరీ టీఎన్‌టీసీ అధ్యక్షులు రావిళ్ళ మాధవనాయుడు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్ర పాటానికి నివాళులర్పించారు. డాక్టర్ రోహిన్, డాక్టర్ హర్షిత, అన్నదాన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు జీవరత్నం నాయుడు, గంజి మాధవయ్య, డిజి ధనపాల్, చెంచయ్య, షణ్ముగంరెడ్డి, కోనేటి రవిరాజు పాల్గొన్నారు.

రేణిగుంట: ఎన్‌టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు రేణిగుంట టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. నాయకులు మహబూబ్‌బాషా, ముని చంద్రారెడ్డి, కందన్ రెడ్డి, పుష్పనాధన్, చంద్రరెడ్డి, రవి, నవాబ్, చిన్నారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సూళ్ళూరుపేటలోని టీడీపీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ అద్వర్యంలో కార్యక్రమం జరిగింది. నాయకులు సతీష్ రెడ్డి, పెరుమాళ్, కిషోర్, సాయి, శ్రీనివాసులు, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్: ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆయన విగ్రహానికి రిజిస్టార్ ప్రొఫెసర్ ఎన్.రజని ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజాత, కాత్యాయని, డిప్యూటీ రిజిస్టార్ గీతవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలయపల్లి: ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం టీడీపీ మండల కన్వీనర్ రాయి మస్తాన్‌నాయుడు ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్ నాయుడు, రామచంద్ర నాయుడు, సత్యం నాయుడు, నరసింహులు నాయుడు, శ్రీనివాసు రెడ్డి, రఘురామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాకాల: ఎన్‌టీఆర్ 28వ వర్ధంతిని గురువారం మండలంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

శీకాళహస్తి: తెలుగు జాతి ఆత్మ గౌరవం కోసం నిరంతర పోరు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు బాటలో నడుద్దామని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్‌టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, రిషితారెడ్డి, ప్రవీణ్, విజయకుమార్, గురవారెడ్డి, ఉష, షాకీరాలీ, రమేష్, రామచంద్రయ్య, బషీర్, జిలానీ, సుప్రజ, రేణుకాదేవి పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో

గూడూరులో



నారావారిపల్లిలో

తిరుపతి మంగళంలో

రాష్ట్రంలో రావణ రాజ్యం

-మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎన్‌టీఆర్ రాష్ట్రంలో రామరాజ్యాన్ని స్థాపిస్తే... ప్రస్తుత ప్రభుత్వం రావణ రాజ్యంగా మార్చిందని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఆరోపించారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్యక్రమాలు జరిగాయి. ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఎన్‌టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీవీనాయుడు విలేకరులతో మాట్లాడుతూ కారణజన్ముడైన ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి వచ్చి అనేక మార్పులు తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. ఒక్క ఛాన్స్ పేరుతో దుర్మార్గాలు జరుగుతున్నాయని, ఇసుక, మైనింగ్ దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతున్నదని ఆరోపించారు. తల్లిని, చెల్లిని పక్క రాష్ట్రానికి తరిమేసారని, శాంతి భద్రతలు పూర్తిగా నశించాయన్నారు. పార్టీ నాయకులు రూ.కోట్లు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్సీవీ నాయుడు

దోపిడీ చేస్తున్నారన్నారు. అయినా ఎటువంటి చర్యలు లేవని విమర్శించారు. రాష్ట్రంలో తిరిగి రామరాజ్యం రావాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, అందువల్ల టిడిపి, జనసేన అధికారంలోకి రావడం తథ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి, నాయకులు రిషితారెడ్డి, దశరదాచారి, గురవారెడ్డి, గాలి చలపతినాయుడు, ఉష, రేణుకాదేవి, ప్రవీణ్ కుమార్, కాసరం రమేష్, కిషోర్, ప్రకాష్ నాయుడు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

దొంగ ఓట్లకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి: కిరణ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లో తన అధికారిక లాగిన్ నుండి వేల సంఖ్యలో ఓటర్ కార్డులు ప్రింట్ అయ్యి రావడంపై అప్పటి తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్, ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ పిఎస్.గిరిషాను సస్పెండ్ చేస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జనసేన పార్టీ నాయకులు కిరణ్ రాయల్ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇంకనూ పోలింగ్ బూత్‌ల వద్ద అధికార పార్టీకి కొమ్ముకాసి దొంగ ఓట్లు వేయించిన పోలీసులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి స్థానికులుగా ఉన్న అప్పటి ఉప కమిషనర్, ప్రస్తుత కమిషనర్ హరిత లాగిన్ నుండి వేల సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు జరిగినట్లు అనుమానంగా ఉందన్నారు. ఎన్నికల కమిషన్ తిరుపతి ఓటర్ల జాబితాను వాయిదావేసి, పునఃపరిశీలన చేయాలని, అప్పుడే పూర్తి స్థాయిలో దొంగ ఓట్లు బయటపడుతాయన్నారు. తిరుపతి స్థానికురాలైన కమిషనర్ హరితకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఎలా భాధ్యతలు ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే ఆమెను బదిలీ చేసి దొంగ ఓట్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, బాబ్జి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు టీటీడీ పెన్షనర్ల సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న టీటీడీ పెన్షనర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 20వ తేదీ తుమ్మలగుంట మార్గంలో గల శివాలయం వద్ద నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ఎస్వీపూర్ హోమ్, ఎస్వి డైరీ ఫార్మ్ వద్ద 2008లో ఇంటి స్థలాలు పొందిన టీటీడీ పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు తప్పక హాజరు కావాలని టీటీడీ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నా భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గోకుల్ నగర్ అధ్యక్షులు మల్లం మోహన్‌రెడ్డితో కలసి భాస్కర్ మాట్లాడుతూ 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన జీవో ద్వారా టీటీడీలో 1973 నుండి 1980 ప్రాంతంలో సానిటరీ వర్కర్ స్థాయి నుండి వివిధ హోదాలకు చెందిన ఉద్యోగులకు తిరుపతి ఎస్వీపూర్ హోమ్, ఎస్వీ డైరీ ఫార్మ్ వద్ద ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు. స్థలాలు పొందిన వారిలో కొంతమంది ఉద్యోగులు నిర్మాణ దశ పనులు చేస్తుండగానే తిరుపతి ఆలయాల పరిరక్షణ సమితి అనేవారు హైకోర్టులో వాజ్యము వేసి స్టే తీసుకువచ్చారని వాదోపవాదాల తరువాత 2013లో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం టీటీడీ ఉద్యోగులకు అనుకూలమైన తీర్పు ఇచ్చిందన్నారు. అయితే 2014లో తిరిగి పరిరక్షణ సమితి వారు సుప్రీంకోర్టు నుండి స్టే తీసుకొచ్చారన్నారు. వాదోపవాదాలు తుది స్థాయికి చేరడంతో టీటీడీ సీనియర్ న్యాయవాదిని నియమించి టీటీడీ పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. ఇదే విషయమై టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవి ధర్మారెడ్డితో సంఘం నాయకులు చర్చించారన్నారు. వారు ఇచ్చిన సలహా మేరకు సర్వసభ్య సమావేశంలో అందరి ఆమోద నిర్ణయాన్ని టిటిడికి తెలపనున్నామన్నారు. ప్రతి పెన్షనరు తప్పకుండా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసన్, పీతాంబరరాజు, చిన్నయ్య, సెల్వరాజ్, నాగరాజు, గుణశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా సంజీవయ్య మాకొద్దు : వైసీపీ నేతలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: పార్టీ కార్యకర్తల పైనే అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయించే 'సంజీవయ్య మాకొద్దు.. జగనన్నే ముద్దు.. బై బై సంజీవయ్య' అంటూ సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య వ్యతిరేకవర్గం ప్లకార్డులతో నిరసన-నినాదాలు హోరెత్తించారు. మండలంలోని వెదురుపట్టు రోడ్డు సమీపంలోని కళ్ళత్తూరు రామమోహన్‌రెడ్డి పంట పొలాల మధ్య అసమ్మతి వర్గం భారీ ఎత్తు సమావేశమయ్యారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కోశాధికారి రామ్మోహన్ రెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల సుమంత్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, పట్టణ పార్టీ అధ్యక్షులు కళ్ళత్తూరు శేఖర్ రెడ్డి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు సీటు రాకుండా చేయడమే ప్రధాన లక్ష్యం అని చెప్పారు. ఈ సమావేశంలో కట్ట సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మంచివారిని

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నేతలు

గెలిపించుకున్న కిలివేటి సంజీవయ్య నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు చేస్తూ, ఆయన ప్రత్యేకించి ఒక గ్రూపును ఏర్పాటు చేసుకొని రాజకీయాలు చేస్తున్నారన్నారు. పార్టీ ప్రారంభం నుండి జెండాను మోసిన కార్యకర్తలను విస్మరించి, వారిపైనే అక్రమ కేసులు బనాయించి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ నుంచి వచ్చిన నాయకులకే ప్రాధాన్యత ఇస్తూ, వారు చెప్పిందే చేస్తూ, అసలైన కార్యకర్తలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. రాబోవు ఎన్నికల్లో కొత్త అభ్యర్థిని శాసనసభ్యునిగా ఎన్నుకునేందుకు ముందుండి గెలిపించుకుంటామన్నారు.

ఎల్లమ్మ.. కొండచుట్టుకు దారేదీ..?

- **తీవ్ర ఇబ్బందులకు గురైన వాహన బ్యారర్లు**
- **ముందస్తు చర్యల్లో విఫలమైన ఆలయ కమిటీ, అధికారులు**
- **పంట పొలాల బురదలో తొక్కుకుంటూ ఊరేగింపు**

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): ఎల్లమ్మా.. కొండ చుట్టు ఉత్సవంలో రహదారి సౌకర్యం బాగా లేక వాహన బ్యారర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవటంలో విఫలమైన కారణంగా ఈ దుస్థితి ఏర్పడింది. సంక్రాంతి సంబరాలలో చంద్రగిరి గ్రామశక్తి శ్రీమూలస్థాన ఎల్లమ్మ కొండచుట్టు ఉత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. సంక్రాంతి పర్వదినాలలో చివరి రోజున అమ్మవారి వాహనాన్ని గ్రామాల మీదుగా కొండ చుట్టు ఊరేగించటం ఆనవాయితీ. శ్రీ మూలస్థాన ఎల్లమ్మను బుధవారం ఆలయ అలంకార మండపంలో వేంచేయింప చేసి అలంకరించి చంద్రగిరి పాతపేటలోని శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయం వద్ద పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వెంట శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల వాహనంతో సహా గ్రామ దేవతల వాహనాలు బయలుదేరుతాయి. ఈ వాహనాలన్నీ అగరాల వద్ద గల ఆరవేటి గంగమ్మ ఆలయం వద్ద కొలువుతీరి చుట్టుపక్కల గ్రామాల ప్రజలుకు దర్శనం భాగ్యం కల్పిస్తారు. అనంతరం శ్రీ మూలస్థాన ఎల్లమ్మ, ద్రౌపతి సమేత ధర్మరాజుల వాహనాలు గ్రామాలు చుట్టుకుంటూ ఆలయం చేరుకుంటాయి. ఈ ఏడాది ప్రత్యేకించి పుల్లయ్యగారిపల్లి అంటే నాలుగు కిలోమీటర్ల అదనంగా అమ్మవారిని

బురదలో తొక్కుకుంటూ, వాహనాలు మోస్తున్న దృశ్యం

ఊరేగించడం జరిగింది. ఇది ఇలా ఉండగా అటు దేవాదాయ శాఖ కానీ ఇటు పాలకమండలి గాని వాహన బ్యారర్లు ఇబ్బంది లేకుండా రహదారిని ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాన్ని మోస్తూ వస్తుండగా స్వర్ణముఖి వాగు గుంతల్లో నీళ్ల, అటుపోతే దారిలో వరిపై నాటకం చేసిన పొలంలో బురదలో తొక్కుకుంటూ అతి కష్టం మీద అమ్మవారిని మోసుకొచ్చారు. మరోపక్క రహదారిని శుభ్రం చేయకపోవడంతో పల్లేరుకాయలు, ముళ్ళు వాహన బ్యారర్లు కాళ్లకు గుచ్చుకుంటూ నానా ఇబ్బందులు పడటం గమనించాల్సిన పరిస్థితి. అమ్మవారి వాహనంపై ఏర్పాటు చేసిన పవిత్రమైన గొడుగు ఓ దశలో పక్కకు వాలి పోవడం జరిగిందని భక్తులు వాపోతున్నారు. ఈ ఏడాది అటు దేవాదాయశాఖ ఇటు అమ్మవారి పాలకమండలి వైఫల్యంతో వాహన బ్యారర్లు చాలా ఇబ్బందులు గురయ్యారని భక్తులు స్థానికులు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి తోడు గురువారం సాయంత్రం అమ్మవారితోటోత్సవం కొత్తపేటలో నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ పరిసర ప్రాంతాలకు సంబంధించి ఓ వ్యక్తి మరణించడంతో శూతకం కారణంగా తోటోత్సవ కార్యక్రమం కూడా రద్దయింది.

సిఎన్‌జి ఇంధన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏజిఅండ్‌పి ప్రథమ్, బిపిసిఎల్ భాగస్వామ్యంతో సిఎన్‌జి ఇంధన కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిటిసి నిరంజన్‌రెడ్డి, ఆర్‌టివో ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ తిరుపతి, చెన్నయ్, బెంగుళూరు, హైదరాబాదు వంటి నగరాలకు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు అనువుగా తిరుపతి, తిరుమల, శ్రీకాళహసి, వి.కోట, చిత్తూరు, కుప్పం, పుంగనూరు, మదనపల్లి, పలమనేరు ప్రాంతాల్లో సిఎన్‌జి ఇందన కేంద్రాలను ఏర్పాటు చేయడం శు

భపరిణామం అన్నారు. ఏజిఅండ్‌పి ప్రథమ్ రీజనల్ హెడ్ చిరాగ్ కె భన్వాడియా మాట్లాడుతూ కీలకమైన గ్రీన్ ఎనర్జీకి అనువుగా ఆంధ్రప్రదేశ్ అంతటా తమ సహజవాయువు నెట్‌వర్క్‌ను విస్తరింపజేస్తున్నామని తెలిపారు. సిఎన్‌జి శక్తితో నడిచే వాహనాలను వినియోగించడం ద్వారా 45 శాతం ఇందన ఖర్చులు తగ్గుతాయని తెలిపారు.

25న 'రాజ్యాంగం-నైతికత'పై సదస్సు

క్యాంపస్ : ఎస్వీయూ సెనెట్‌హాల్లో 'రాజ్యాంగం- నైతికత' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు పౌరహక్కుల సంఘం నేతలు వెల్లడించారు. 1950లో భారత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని, నైతికత పునాదిగా ప్రజాస్వామ్యయుతంగా రాజ్యపాలన ఉండాలనే భావన ఆదర్శంగా నిలిచిందన్నారు. అయితే ఆచరణలో ఆదినుంచి ప్రజలకు భంగపాటు ఎదురయ్యిందన్నారు. పాలకవర్గాలు రాజ్యాంగ సవరణలు చేసి ప్రజల హక్కులను హరిస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతులను నులిమేయడం నిత్యకృత్యమయ్యిందన్నారు. 75వ రిపబ్లిక్ దినోత్సవాన్ని జరుపుకోనున్నామని, ఈ సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా వీసి ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన వక్తగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరవుతారని తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి-నాయుడుపేట: తరచూ బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల నమోదైన కేసుల ఆధారంగా సీఐ జగన్‌మోహన్‌రావు, ఎస్ఐలు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టినట్లు వివరించారు. నిందితులు నాయుడుపేట టౌన్, అమరా గార్డెన్స్‌కు చెందిన యువకులుగా గుర్తించి అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గత కొంత కాలంగా బైక్ చోరీలకు పాల్పడి వాటిని అమ్ముకొని జల్సాలకు అలవాటుపడినట్లు విచారణలో వెలుగుచూసినట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ జగన్‌మోహన్‌రావు, ఎస్ఐలు రఘునాథ్, కృష్ణయ్య, శ్రీకాంత్, సిబ్బంది కరీం, మస్తాన్, కుమార్ రాజా, ముని శేఖర్, దయాకర్, భాను తేజలను అభినందించారు.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P.No. 269 / 2023

1. Talanki Sumathi
2. Talanki Meghana
3. Talanki Sanjana
No. 3 being minor Rep.by its mother and natural Guardian
Talanki Sumathi - పిటిషనర్లు

Vs

Nil - రెస్పాండెంటు

జనరల్ నోటీసు

పై నెంబరులోని 1వ పిటిషనరు భర్త 2వ మరియు 3వ పిటిషనర్లు తండ్రి అయిన **తలంకి శ్రీధర్ రావు** పేరున ఉన్న ప్రోనోట్లు బాకీ రాబట్టుకొనుటకు గాను గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో **O.S.No.52/2019** మరియు **O.S.No.53/2019** దావాలు దాఖలు చేసియున్నారు. సదరు దావాలు నందు తాలంకి శ్రీధర్ రావుకు పిటిషర్లు మాత్రమే వారసులు అని నిర్ణయించి వారసత్వ సర్టిఫికేటు ఇవ్వవలసినదిగా కోరుచూ పై పిటిషన్ దాఖలు చేసినందున పై పిటిషన్ విషయము గురించి ఎవరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల **తేది: 22-01-2024 న ఉదయం 10.30 గంటలకు** హాజరై తెలుపుకోవలసినది. లేనియెడల ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు
ఎస్.ఉమాశంకర్
అడ్వకేట్, గూడూరు